# మహాభారతం

బాలల కోసం తెలుగు సరళ వ్యావహారికంలో
ఆది సభా అరణ్యపర్వాలు



అయలసోమయాజుల నీలకంఠేశ్వర
జగన్నాథశర్మ

**అ**యలసోమయాజుల నీలకంఠేశ్వర (ఎ.ఎన్) జగన్నాథశర్మ 13.4.1956లో పార్వతీపురంలో జన్మించారు. చిన్ననాటి నుండి కథల పట్ల మమకారం పెంచుకున్న ఈయన పదిహేనవ ఏటనే కథలు రాయడం ప్రారంభించారు. ఇప్పటి వరకు సుమారుగా అయిదువందల కథలు రాశారు. వీరి రాజధాని కథలు (యువ మాసపత్రిక), మా ఊరి కథలు (పల్లకి వార పత్రిక), అగ్రహారం కథలు (ఆదివారం ఆంధ్ర జ్యోతి) పాఠకుల ఆదరణ పొందాయి. కథలతో పాటు అగ్రహారం, శౌర్యచక్ర, చార్మినార్, ఇక్కడంతా క్షేమం, ఛానెల్ 18 నవలలు రాశారు. సినిమా, టి.వి. రచయితగా కూడా వీరు ప్రసిద్ధులు.

**అరణి, అనీలజ, నీలకంఠాచార్య వీరి కలం పేర్లు.**

అనేక ప్రపంచ ప్రఖ్యాత కథలను వీరు తెలుగులోకి అనువదించారు. వీరు అనువదించిన ప్రపంచ జానపద కథలు 'పాలపిట్ట', కథాసంకలనం 'పేగు కాలిన వాసన' ఇటీవల విడుదలై విశేష ఆదరణ పొందాయి. ప్రస్తుతం వీరు ఆంధ్రజ్యోతి ప్రచురణ 'నవ్య' వీక్లికి సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు.

# మరల ఎందుకనగా....

**తిం**టే గారెలు తినాలి, వింటే భారతం వినాలి అనే మాట ఈతరం పిల్లలకు తెలుసా?

అంత రుచికరమైంది, ఆహ్లాదకరమైంది మహాభారతం.

మన ఇతిహాసాల్లో అపురూపమైంది.

మరల మరల ప్రతి తరం చదవాలనుకునే పౌరాణిక గాథ.

ఆబాలగోపాలాన్ని శతాబ్దాలుగా అలరిస్తున్న అద్భుతగాథ.

మానవనైజాన్నీ, లోకం పోకడల్నీ, జీవిత సారాంశాన్ని చెప్పకనే చెప్పిన ఉద్గ్రంథమిది.

వేదవ్యాసుడు సంస్కృతంలో రాసిన మహాభారతాన్ని ఇప్పటికే ఎందరో తెలుగులోకి అనువదించారు.

నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱన-కవిత్రయం మహాభారతాన్ని తొలుత వెలుగులోకి తెచ్చారు. మరెందరో ప్రాచీన కవులు, ఆధునిక రచయితలు, కవులు పద్యంలో, గద్యంలో మహాభారతాన్ని తిరగ రాశారు.

అయినప్పటికీ ఎప్పటికప్పుడు వచ్చే తరానికి కొత్తగా వినిపించాల్సిన గాథ మహాభారతం.

అత్యాధునిక సాంకేతిక ధోరణులు ప్రబలిన ఇరవయ్యొకటో శతాబ్దంలో జీవిస్తున్న వారి చేత సరికొత్తగా చదివించాల్సిన గ్రంథమిది.

మరి ఈతరానికి నచ్చేట్టుగా, వారి మనసు మెచ్చేట్టుగా, చవులూరిస్తూ చదివించేవిధంగా మహాభారతాన్ని అందిస్తున్నారు అయల సోమయాజులు నీలకంఠేశ్వర జగన్నాథశర్మ.

ఆబాలగోపాలానికి సులువుగా బోధపడేందుకు గాను సరళమైన శైలిలో **'అరణి'** పేరుతో జగన్నాథశర్మ రచిస్తున్న మహాభారతం ఆంధ్రజ్యోతి ప్రచురణ 'నవ్య' వీక్లీలో వారం వారం ధారావాహికంగా ప్రచురితమవుతోంది.

కథ చెప్పడంలో ఆరితేరిన నైపుణ్యం గల జగన్నాథశర్మ రాస్తున్న ఈ మహాభారతం చదవడం పాఠకులకు అపురూప అనుభవం. కనుకనే పద్దెనిమిది పర్వాలున్న ఈ మహాభారతాన్ని ఆరు పుస్తకాలుగా ప్రచురించ తలపెట్టింది 'పాలపిట్ట'. తొలుతగా ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వం కలిపి ఒక పుస్తకంగా విడుదల చేస్తోంది. తర్వాత కాలంలో వరుసగా మిగతా భాగాలు విడుదలవుతాయి.

ఎవరు ఏ రంగంలో ఉన్నా జాతి సంస్కృతికి అద్దం పట్టే ఇతిహాసాల్ని చదవడం అవశ్యం. అందుకే ఇవాళ్టి తరానికి మహాభారతాన్ని అందించ తలపెట్టాం. మా ఇతర ప్రచురణలలాగే ఈ పుస్తకాన్ని కూడా పాఠకలోకం సమాదరిస్తుందని ఆశిస్తున్నాం. తన విలువైన కాలాన్ని మహాభారతాన్ని రచించేందుకు ఉపయోగిస్తూ ఈ పుస్తక ప్రచురణకు అనుమతించిన జగన్నాథశర్మకి ధన్యవాదాలు.

**- పాలపిట్ట బుక్స్**

# మహాభారతం

బాలల కోసం సరళ వ్యావహారికంలో  ఆది సభా అరణ్య పర్వాలు

ఎ.ఎస్. జగన్నాథ శర్మ

పాలపిట్ట-బుక్స్
హైదరాబాద్

**MAHAA BHAARATAM** *(Aadi Sabha Aranya Parva) by*

---

**A.N.JAGANNADHA SHARMA**

*mobile : 99854 67222, 040-2383 5146*

*jagannadhasharma@gmail.com*

© : Author

*First Edition* : December 2010

*Price* : **Rs. 100/-**

*For Copies* : **Palapitta Books**
# 16-11-20/6/1/1
403, Vijayasai Residency
Saleemnagar, Malakpet
Hyderabad - 500 036
Cell : 98487 87284
*palapittabooks@gmail.com*

*Cover designed by* : Ramanajeevi

*Cover illustration by* : Baali

*Layout designed by* : K. Rama Krishna

*Printed at* :

## కృతజ్ఞతలు

మహాభారతాన్ని నవ్యవీక్లిలో
ప్రచురించి ప్రోత్సహించిన
**శ్రీ వేమూరి రాధాకృష్ణ** గారికి,
నన్ను అభిమానించే అన్నయ్య
**డాక్టర్ కె.వివేకానందమూర్తి**కి
హృదయపూర్వక కృతజ్ఞతలు.

# అంకితం



నన్ను కన్న నా తల్లిదండ్రులు

**అయలసోమయాజుల రామసోదెమ్మ**

**అయలసోమయాజుల జగన్నాథం గారికి**

సవినయంగా నమస్కరిస్తూ....

# ఆదిపర్వం

# సత్యవతి పుట్టుక

**చే**ది దేశాన్ని ఉపరిచర వసువు పాలించేవాడు. ఇంద్రుడి ఆనతి మేరకు ఆ దేశాన్ని అతను పాలించేందుకు అంగీకరించాడు. వేటంటే అతనికి చాలా ఇష్టం. తరుచూ వేటకి వెళ్ళేవాడు. ధర్మం అంటే అతనికి ప్రాణం.

చేది దేశ రాజధాని సమీపంలో శుక్తిమతి అని ఓ నది ప్రవహిస్తోంది. దాన్ని కోలాహలుడు అనే పర్వతరాజు అడ్డగించి ఆక్రమించుకున్నాడు. ఆ సంగతి తెలిసి వసుమహారాజు ఆ పర్వతాన్ని కాలితో ఒక్క తన్ను తన్ని అక్కణ్ణుంచి గెంటేశాడు. అయితే అప్పటికే ఆ నది పర్వతరాజును కూడి ఓ కూతుర్ని, ఓ కొడుకుని కన్నది. వారిని రాజుకిచ్చి రక్షించమంది. వసుప్రదుడని పేరుపెట్టి ఆ కుర్రాణ్ణి సేనాధిపతిగా చేసుకున్నాడు రాజు. గిరిక అని పేరు పెట్టి పిల్లని తనే వివాహం చేసుకున్నాడు. గిరికకు యుక్తవయసు వచ్చింది. ఋతుమతి అయిందామె. కొడుకును కనే అదృష్టానికి నోచుకుంది. ఇది తెలుసుకున్న పితృదేవతలు రాజుని వేటకి వెళ్ళమన్నారు. మంచి లేడి మాంసం తెచ్చి తినిపించమన్నారు. దాంతో అడవికి బయల్దేరాడు వసుమహారాజు. అడవికి బయల్దేరాడే కాని, గిరికను విడిచి వెళ్ళడం అతనికి ఇష్టం లేకపోయింది. భార్యను విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేకపోతున్నాడు రాజు. ఆమెను, ఆమె అందాన్ని అంతగా ప్రేమిస్తున్నాడతను.

అది వసంతకాలం. అడవి అంతా విరగబూసి ఉంది. చల్లని గాలి. గాలికి తోడు తుమ్మెద ఝుంకారాలూ కోకిల కూతలు. దాంతో రాజు మన్మథ వికారానికి లోనయ్యాడు. చెంతన లేని గిరికను తలచుకుంటూ ఓ అశోకవృక్షం నీడన కూర్చున్నాడు. గుత్తులు గుత్తులుగా పువ్వులతో వేలాడుతున్న ఆశోకవృక్షం గిరికను మరింతగా గుర్తు చేసిందతనికి. దాంతో ఇంద్రియ స్ఖలనం అయింది. ఇంద్రియం వ్యర్థం కాకూడదనుకున్నాడు రాజు. ఆకును దొప్పగా చేసి అందులో ఇంద్రియాన్ని భద్రపరిచాడు. అక్కడ రాజాంతఃపురంలో గిరిక తనతో సంగమాపేక్షతో ఉంటుందని అతనికి తెలుసు. ఆమె ఋతువు కూడా వ్యర్థం కాకూడదనుకున్నాడు. ఆలోచించగా ఆలోచించగా రాజుకి ఒక డేగ కనిపించింది. దాన్ని పిలిచాడతను. చేతిలోని దొప్పను దాని మెడకి కట్టాడు.

''గిరికకు ఇచ్చిరా'' అని చెప్పాడు. ఆకాశానికి ఎగిరింది డేగ. రివ్వున బయలుదేరింది. అదలా ప్రయాణించడాన్ని మరో డేగ చూసింది. డేగ మెడకున్న వసుమహారాజు కట్టిన దొప్పను అది మాంసఖండం అనుకుంది. పోట్లాటకు దిగింది. రెండు డేగలూ తన్నుకున్నాయి. ఒకదాన్ని ఒకటి పొడుచుకున్నాయి. కిందా మీదా పడ్డాయి. ఆ పడడంలో దొప్ప చిరిగి రాజు రేతస్సు రెండు చుక్కలు కిందపడ్డాయి.

కింద యమునా నది ప్రవహిస్తోంది. అందులో ఓ పెద్ద ఆడ చేప తిరుగుతోంది. గత జన్మలో అది 'అద్రిక' అనే అప్సరస. ఆమెను 'చేపవయి పొమ్మని' శపించాడు బ్రహ్మ. అప్పుణ్ణుంచి యమునలో తిరుగాడుతోందది. కింద పడిన రాజు రేతస్సు రెండు చుక్కల్నీ అది అందుకుంది. మింగేసింది. ఫలితంగా గర్భవతి అయింది. నెలలు నిండాయి. ఆ సమయంలో జాలరుల వలకి చిక్కిందది. వలలో పెద్ద చేప పడిందని సంబరపడి, దానిని కోసి చూశారు జాలరులు. చేప కడుపులో వారికి ఓ ఆడపిల్లా ఓ మగపిల్లాడు కనిపించారు. ఆశ్చర్యపోయారు వారు. తీసుకుని వచ్చి పసివాళ్ళిద్దరినీ వసుమహారాజుకి అప్పగించారు.

''చేప కడుపులో దొరికారయ్యా'' అని చెప్పారు.

పిల్లాడికి 'మత్స్యరాజు' అని పేరు పెట్టి అతన్ని ఓ దేశానికి రాజుని చేశాడు వసుమహారాజు. పిల్లకు 'సత్యవతి' అని పేరు పెట్టి దాశరాజుకు పెంచుకోమని ఇచ్చాడు.

ఆనాడు అద్రికను చేపవయిపొమ్మని శపించినప్పుడే శాప విమోచనాన్ని కూడా బ్రహ్మ ప్రసాదించాడు. మనిషి పిల్లల్నిద్దరిని కన్నప్పుడే శాప విమోచనం అన్నాడతను. పిల్లల్ని కని శాప విమోచనం పొంది అద్రిక స్వర్గానికి చేరుకుంది.

దాశరాజు ఇంట సత్యవతి పెరిగి పెద్దదయింది. చేప కడుపున పుట్టిన కారణంగా ఆమె చేప కంపు కొట్టసాగింది. తండ్రి అంటే ఎంతో అభిమానం ఆమెకు. అతని కష్టంలో పాలుపంచుకోవాలని యమునా నదిలో నావ నడపసాగింది.

# వ్యాసుని జననం

మహాతపస్సంపన్నుడు, తేజోవంతుడు, త్రిలోక పూజ్యుడు అయిన పరాశరుడు శక్తిముని కుమారుడు. వశిష్ఠుని మనుమడు. పరాశరుడు తీర్థయాత్రలకు బయల్దేరాడు. యమునా నదిని సమీపించాడు. నది దాటాలి. అప్పుడతనికి మత్స్యగంధి కనిపించింది. నావ నడుపుతోందామె. నావ నది మధ్యకు వచ్చింది. పరాశరునికి మత్స్యగంధిపై మనసయింది. ఆ మాటే చెప్పాడామెకు. మత్స్యగంధి తాను కన్యనని, కన్యాత్వం పోగొట్టుకోలేనని చెప్పింది. ఆమె కన్యాత్వం వికలం కాదన్నాడు పరాశరుడు. తాను చేప కడుపున పుట్టడంతో తన శరీరమంతా చేపల కంపు అన్నది మత్స్యగంధి. ఆమెను యోజనగంధిని చేశాడు పరాశరుడు. ఆమె శరీరం నుంచి వెలువడే సువాసన యోజన దూరం వరకు వ్యాపించేట్టుగా వరమిచ్చాడు. ఇంతకీ యోజనగంధి ఎవరనుకున్నారు? సత్యవతే!

''మిట్ట మధ్యాహ్నం వేళ సాంగత్యమా'' అని సిగ్గుపడింది సత్యవతి. చుట్టూ మంచుతెర కల్పించాడు పరాశరుడు. చీకటిని సృష్టించాడు. తర్వాత కృష్ణ ద్వీపానికి చేరి సత్యవతిని కూడి సుఖించాడు. సత్యవతికి సద్యోగర్భమయింది. ఆ ద్వీపంలో ఆమె వ్యాసుని కన్నది. కృష్ణ ద్వీపంలో జన్మించడంతో వ్యాసుడు కృష్ణద్వైపాయనుడయ్యాడు. తేజస్వి, జ్ఞాని, లోక కల్యాణకారకుడయిన వ్యాసుని చూసి పరాశరుడు మురిసిపోయాడు. తర్వాత తల్లీబిడ్డలను ఆశీర్వదించి తీర్థయాత్రను కొనసాగించేందుకు బయల్దేరాడు.

కొన్నాళ్ళకు మహాభారతకర్త వేదవ్యాస మహర్షి తల్లిముందు చేతులు జోడించి నిల్చున్నాడు.

''తల్లీ! నీవు తలచుకున్నంతనే నీ పుత్రుడు ఈ వేదవ్యాసుడు నీ ముందుంటాడు. ఇక నాకు సెలవు'', అని తపోవనానికి తరలిపోయాడు.

# శంతనుని జన్మవృత్తాంతం

ఇక్ష్వాకువంశీయుడు మహాభిషుడు వేయి అశ్వమేధయాగాలు, నూరు వాజపేయయాగాలు చేసి, అమరులను ఆనందింపజేసి, స్వర్గానికి చేరుకున్నాడు. అక్కడ ఓనాడు దేవతలతోను, రాజర్షులతోను కలసి పరమేష్ఠిని సందర్శించాడు. అప్పుడక్కడికి గంగాదేవి కూడా వచ్చింది. అంతలో పెనుగాలి వీచింది. ఆ గాలికి గంగాదేవి పైట తొలగి, ఆమె వక్షోజాలు పూర్ణ కుంభాల్లా దర్శనమీయడంతో మహాభిషుడు తప్ప మిగిలిన వారందరూ ఆ దృశ్యాన్ని చూడకూడదన్నట్టుగా తలలొంచుకున్నారు. మహాభిషుడు మాత్రం ఆ అందాలను తనివిదీరా చూడసాగాడు. ఇదంతా ఓ కంట గమనించిన పరమేష్ఠి కోపించాడు.

''నీవు మానవ జన్మ పొందుదువుగాక'' అని మహాభిషుని శపించాడు. శత విధాల వేడుకున్న మీదట ప్రతీప ధరణీశ్వరుని కొడుకుగా పుట్టేందుకు మహాభిషుని అనుమ తించాడు. జరిగింది తలచుకుంటూ, తన అందాల్ని తనివితీరా చూసి



ఆనందించిన మహాభిషుని మెచ్చుకుంటూ భూలోకానికి బయల్దేరిన గంగా దేవిని మార్గ మధ్యంలో ఎనమండుగురు వసువులు కలిశారు. వారంతా భయం భయంగా వసివాడిన ముఖాలతో కృశించి గంగాదేవిని చూస్తూనే దుఃఖించసాగారు.

''ఎందుకు దుఃఖిస్తున్నారు?'' అడిగింది గంగా దేవి.

''తప్పు చేసి వశిష్ఠ మహర్షి వారి కోపానికి గురయ్యాం. చేసిన తప్పుకి మానవలోకంలో జన్మించాల్సిందిగా శాపాన్ని పొందాం. ఫలితంగా త్వరలో మేము భూలోకంలో జన్మించక తప్పదు. అందుకని...నీవు మాకు తల్లివై ఈ కష్టాన్ని కడతేర్చా ల్సిందిగా వేడుకుంటున్నాం'' అన్నారు వసువులు.

''మహాభిషుడు ప్రతీప భూపతి కుమారుడు శంతనుడిగా అవతరించబోతున్నాడు. నీవు అతనికి భార్యవై మాకు తల్లి కాగలవు'' అన్నారు మళ్ళీ.

''సరే! మీ అభీష్టం నెరవేరుస్తాను'' అన్నది గంగాదేవి.

''మరొక చిన్న సాయం చేయవలసి ఉంది'' అన్నారు వసువులు.

''ఏంటది?'' అడిగింది గంగాదేవి.

''నీకు మేము జన్మించిన మరుక్షణం మమ్మల్ని నీవు గంగపాలు చేయాలి. ప్రవాహవేగంలో పడవేయాలి. అలా నువ్వు చేసిన పక్షంలో ఆ మానవలోకంలో చిరకాలం జీవించాల్సిన గతి మాకు తప్పి, మేము సుఖపడగలం. ఇదే తరుణోపాయమని వశిష్ఠులు వారు మాకు సెలవిచ్చారు. ఇందుకు నీవు కరుణించాలి'' అన్నారు వసువులు.

''సరే! మీరు చెప్పినట్టుగానే చేస్తానుగాని, మీ అందరిలోనూ ఒక్కడైనా దీర్ఘాయుష్మంతుడై జీవించాలని ఆశగా ఉంది. తల్లిగా నా ఆశను నెరవేర్చరా?'' అడిగింది గంగాదేవి. ఆమె మాటను కాదనలేకపోయారు వసువులు. తమ అందరి తేజో భాగాల్లోనూ నాలుగవ అంశ గ్రహించి జన్మించిన అష్టమ వసువు దీర్ఘాయుష్మంతుడై వర్ధిల్లగలడని వాగ్దానం చేశారు.

రోజులు గడిచాయి.

ప్రతీపుడు భాగీరథీ తీరంలో తపస్సుకు ఉపక్రమించాడు. తపస్సు చేస్తోన్న ప్రతీపుని సమీపించి ''నాథా! నాథా'' అని పలుమార్లు పిలిచింది గంగాదేవి. తపోభంగానికి కళ్ళు తెరిచాడు ప్రతీపుడు.

''ఏం కావాలి?'' అనడిగాడు.

''నన్ను పెళ్ళి చేసుకుని సుఖించు'' అన్నది గంగాదేవి.

''నీవు నా కోడలివయితే బాగుంటుంది. త్వరలో నాకు శంతనుడు జన్మించబోతున్నాడు. అతన్ని నీవు పెళ్ళి చేసుకోవడం సముచితంగా ఉంటుంది'' అన్నాడు.

''ఆ సమయం ఆసన్నమయింది'' అన్నాడు మళ్ళీ. అన్నట్టుగానే శంతనుడు జన్మించాడు. పెరిగి పెద్దవాడయ్యాడు. శంతనునికి రాజ్య భారం అప్పగించి ప్రతీపుడు భార్య సునందాదేవితో కలిసి తపోవనానికి చేరుకున్నాడు. శంతనుడు

ప్రజాపాలనకు ఉపక్రమించాడు. ఒకనాడు శంతనుడు మృగయా వినోదంతో ఆనందిస్తూ అమరవాహినీతట ప్రాంతంలో పర్యటించసాగాడు. అప్పుడు అతను గంగాదేవిని, ఆమె అందాలను గమనించి నోట మాటరాక నిలువెల్లా కళ్ళు చేసుకుని గమనించసాగాడు. గంగాదేవి కూడా శంతనుని అదే విధంగా చూడసాగింది. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. మనసులు కూడా కలిశాయి. ఇక వివాహమయితే బాగుణ్ణనుకున్నాడు శంతనుడు.

# వసువులకు వశిష్ఠుని శాపం

గంగాదేవిని చూసిన శంతనుడు 'ఈ అందాల రాశి నా భార్య అయితే బాగుణ్ణు' అనుకున్న మరుక్షణం ఆమె అందంగా నవ్వుతూ శంతనుని సమీపించింది.

''నీ మనసులోని కోరిక తెలుసుకున్నాను మహారాజా! తప్పకుండా నీ భార్యనై నిన్ను ఆనందింపజెయ్యగలను. అయితే నాదొక చిన్న విన్నపం. నేనేది చేసినా నువ్వు దానిని కాదనరాదు. అది శుభమైనా, అశుభమైనా అంగీకరించి తీరాలి. నన్ను తిట్టరాదు. నా మనసు నొప్పింపరాదు. ఇందుకు భిన్నంగా నువ్వు ప్రవర్తించిన మరుక్షణం నేను నిన్ను విడిచి వెళ్ళిపోతాను. దీనికి నువ్వు ఒప్పుకుంటేనే మనిద్దరికీ పెళ్ళి. లేదంటే లేదు'' అన్నది గంగాదేవి. అందుకు ఆనందంగా అంగీకరించాడు శంతనుడు. పెళ్ళయింది. గంగా శంతనులకు కాలం తెలిసి రాలేదు. ఇద్దరూ ఆనంద పారవశ్యంలో ఓలలాడారు. సంవత్సరాలకు సంవత్సరాలు గడిచిపోయాయి. గంగాదేవి ఏడుగురు కుమారులను కన్నది. అయితే కన్న వెంటనే ఆ కుమారులను భాగీరథీ ప్రవాహంలో పడవేసింది. బాధ కలిగినా చూస్తూ పూరుకున్నాడు శంతనుడు. వారించిన పక్షంలో గంగాదేవి తననెక్కడ విడిచిపోతుందోనని భయ పడ్డాడు. కొంత కాలానికి అష్టమ పుత్రుడు జన్మించాడు. ఆ పుత్రుణ్ణి కూడా భాగీరథీ ప్రవాహంలో పడవేసే తరుణంలో ముద్దులు మూటగట్టే ఆ బాలుణ్ణి కాపాడుకోదలచి గంగా దేవిని అడ్డుకున్నాడు శంతనుడు.



''ఈ బాలుణ్ణి నువ్వు భాగీరథీ ప్రవాహంలో పడవేస్తా నంటే నేను ఒప్పుకోను. ఏడుగుర్ని పోగొట్టుకుని పుత్ర శోకంతో అలమటిస్తున్నాను. ఈ ఎనిమిదవ వాణ్ణయినా రక్షించుకుంటాను. నా కొడుకుని నాకిచ్చేయ్! ఆగు!'' అని ఎదురు నిలిచాడు.

''తీసుకోండి మహారాజా'' కొడుకుని అందజేసింది గంగాదేవి. అందుకున్నాడు శంతనుడు.

''ఇక నాకు సెలవు'' అంది గంగాదేవి. అక్కణ్ణుంచి నిష్క్రమించేందుకు ముందుకు కదిలింది.

''ఎక్కడికి?'' ఆందోళన చెందాడు శంతనుడు.

''మీరు ఇచ్చిన మాట తప్పారు. నన్ను కాదని ఎదురు నిలిచారు. ఈ కారణంగా మనం విడిపోతున్నాం'' అన్నది గంగ. బాధగా చూశాడు శంతనుడు.

''ఇన్నాళ్ళూ నేనెవరో...ఏమిటో మీకు తెలీదు. మీరు అడగలేదు. నేనూ చెప్పలేదు. ఇప్పుడు చెబుతున్నాను. నేను

జహ్నుమహర్షి తనూజాతను. జాహ్నవీదేవిని. మునీంద్రులు సేవించే భాగీరథిని. దేవ కార్యం కోసమై మీతో కలసి జీవించాల్సి వచ్చింది'' అన్నది గంగ.

''ఇంకొక విషయం. వశిష్ఠ మహర్షి శాపంతో వసువులకి ఈ నరలోకంలో జన్మించాల్సిన దుర్గతి కలిగింది. వారికి తల్లిదండ్రులయ్యే అవసరం, అవకాశం మీకు, నాకుగాని మరొకరికి లేదు. దాంతో నేను ఈ నారీ రూపాన్ని సంతరించుకున్నాను. జన్మించిన వెంటనే ఈ లోకం నుంచి విముక్తి కలిగించగలనని వసువులకు మాట ఇచ్చాను. అయితే కడసారి వాణ్ణి మాత్రం దీర్ఘాయుష్మంతునిగా చూసుకోవాలన్నాను. అన్నట్టుగానే...అనుకున్నట్టుగానే జరిగింది. ఏడుగురికి శాపవిమోచన చేశాను. మీ చేతిలోని బాలుడు ఎనిమిదవ వాడు. వీడే భరతవంశ శ్రేష్ఠుడు'' అన్నది మళ్ళీ గంగ.

వసువుల శాప విమోచనాన్ని తెలుసుకున్న శంతనుడు, వారిని వశిష్ఠుడు ఎందుకు శపించిందీ తెలుసుకోదలచాడు.

''దేవీ! దేవతలు కూడా పూజించదగిన వసువులను వశిష్ఠులు వారు ఎందుకు శపించారు? ఈ ఎనిమిదవ వాడు ఎందుకిలా ఈ మానవ లోకంలో నిలిచిపోయాడు? వసువులకి ఈ దుర్గతి ఎందుకు కలిగింది? దయచేసి వివరించు'' అని అడిగాడు. గంగ చెప్పసాగింది.

''వరుణ మహాముని చిరకాల తపస్సు ఫలించి వశిష్ఠుడు ఆయన కుమారుడిగా అవతరించాడు. అవతరించి మేరు పర్వత గుహలలో ఘోర నిష్ఠలో మునిగి బాహ్య ప్రపంచాన్నే మరిచిపోయాడు. ఆ సమయంలో నందినీ అన్న ఆవు వశిష్ఠుని హోమ అవసరాలను నెరవేరుస్తూ కన్నతల్లిలా అతన్ని కాపాడుకోసాగింది. రోజులు గడిచిపోతున్నాయి. ఒకనాడు వసువులు ఎనమండుగురు తమ భార్యలతో ఆ గుహలను సందర్శించి అక్కడి కొండ చరియల్లోను, సెలయేళ్ళలోను యథేచ్ఛగా సంచరించి ఆనందించారు. వారిలో ఓ వసుముఖ్యుని భార్య నందినీని చూసి ముచ్చటపడి, ఆ ఆవు బొమ్మగా గీసి భర్తకు చూపించింది. అది చూసి భర్త ఆశ్చర్యపోయాడు.

''ఇది వశిష్ఠ మహర్షి హోమధేనువు. దీని పాలు ఆరగించిన వారు పదివేల సంవత్సరాల పర్యంతం వ్యాధులకు, ముసలితనానికి దూరమై సుఖంగా జీవిస్తారు'' అన్నాడు.

''అయితే నా స్నేహితురాలు జితవతికి ఈ ఆవు పాలు అత్యవసరం. నా స్నేహితురాలు గొప్ప సౌందర్యవతి. ఆ సౌందర్యం ఆమెను ఎల్లకాలం అంటిపెట్టుకుని ఉండిపోవాలంటే ఈ ఆవు పాలు ఆమె తాగి తీరాలి! ఇందుకు మీరు నందినీని తోడుకుని రావాలి. తప్పదు'' అంది అతని భార్య. ఆమె అభీష్టం తప్పక నెరవేర్చాల్సిందే అన్నారు మిగిలిన వసువులు. దాంతో వసువులంతా రహస్యంగా నందినీని అపహరించి వసు ముఖ్యుని భార్య కోరిక తీర్చారు. ఫల పుష్పాల కోసం అరణ్యానికి పోయి తిరిగి వచ్చి గుహలను చేరుకున్న వశిష్ఠునికి నందినీ, దాని దూడ కనిపించకపోవడంతో దివ్యదృష్టితో జరిగిందంతా తెలుసుకుని, వసువులందరినీ నరలోకంలో జన్మించమని శపించాడు. ఈ దుర్వార్త తెలిసిన మరుక్షణం వసువులు నందినీని, దాని దూడను వశిష్ఠునికి అప్పగించి, శాప విమోచన కోరారు.

''మనుజ లోకంలో జన్మించిన అనంతరమే మీకు శాప విమోచన కలుగుతుంది. అయితే ఈ దురాగతానికి ఒడిగట్టిన ముఖ్య వసువు ప్రభాసుడు మాత్రం చిరకాలం మానవ లోకంలో నివసించి తీరాలి. దీనికి తిరుగులేదు'' అన్నాడు వశిష్ఠుడు.

''ఆ ప్రభాసుడే ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న భరత వంశ శ్రేష్ఠుడు'' అని వివరించింది గంగాదేవి.

'' ఈ బాలుడు బాగా ప్రాయానికి వచ్చేంత వరకు నా దగ్గరే పెరుగుతాడు. అందుకు మీరు అనుమతించాలి'' అని శంతనుని చేతిలో ఉన్న బాలుణ్ణి అందుకుని అక్కణ్ణుంచి నిష్క్రమించింది. తదనంతరం ఆ బాలుడే గాంగేయుడిగా, దేవవ్రతుడుగా ప్రసిద్ధి చెందాడు. ఏళ్ళు గడిచిపోయాయి. ఒకనాడు శంతనుడు, మృగయా విహారంతో వినోదించి అలసి, గంగాతీరానికి చేరుకున్నాడు. అక్కడ ఓ బాలుడు ధనుర్విద్యను అభ్యసిస్తూ బాణాలతో గంగానదిపై ఆనకట్టను నిర్మించే ప్రయత్నాన్ని చూశాడు. మహా వీరుడిలా కనిపిస్తూ గొప్ప తేజస్సుతో వెలిగిపోతున్న ఆ బాలుడు, తన బిడ్డేనన్న సంగతి శంతనుడు తెలుసుకోలేకపోయాడు. ఎప్పుడో చిన్నప్పుడు కొడుకుని చూశాడు. ఇప్పుడా పోలికలే లేవు. బాలుణ్ణి గుర్తు పట్టలేకపోయాడు శంతనుడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=151**